

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 9 సెప్టెంబరు 2024





మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి

ఉండ్రాళ్లయ్యా.. బొజ్జ గణపయ్యా..

● వాడవాడలా కొలువైన గణనాథులు
● వేడుకగా చవితి ఉత్సవాలు


బద్వేలులోని మైదుకూరు రోడ్డులో వెలసిన బొజ్జగణపయ్య


ప్రొద్దుటూరు వెదుర్ల బజార్‌లో కొలువైన బాలగణపతి



కడప(కల్చరల్), సెప్టెంబరు 8: ఆది దంపతుల గారాల తనయుడు విఘ్నేశ్వరుడి చవితి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. పట్టణాలు, పల్లెలు, అనే తేడా లేకుండా వాడవాడలా గణనాథులను కొలువుదీర్చారు. కొన్ని కూడళ్లలో భారీ బొజ్జగణపయ్యలను ఏర్పాటుచేశారు. ఇళ్లలో సైతం లంబోదరుడి విగ్రహ ప్రతిమలను కొలువుదీర్చారు. అలాగే కడప నగరంతో పాటు ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు, కమలాపురంలో ఉదయం నుంచి విగ్రహాలకు శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ఠ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడు కొలువైన మండపాల వద్ద శని, ఆదివారాల్లో విశేష పూజలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టికొట్టే కార్యక్రమాలతో పాటు చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. లడ్డూల వేలంపాటలు ఉత్సాహంగా జరిగాయి. పలుచోట్ల లక్షల్లో లడ్డూ వేలంపాట సాగింది. కాగా ఆదివారం పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి సేవలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, అధికారులు, తరించి భక్తిపారవశ్యం పొందారు. కాగా సోమవారం మూడవ రోజు చాలాచోట్ల వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


ఎన్జీఓ కాలనీలో కొలువైన 42 అడుగల భారీ విగ్రహం

నగరంలో.. భారీ విగ్రహాలు

వినాయక చవితి పర్వదినం సందర్భంగా నగర ఎన్‌జీవో కాలనీలో వినాయక ఉత్సవ కమిటీ చైర్మన్ అందూరి రాజగోపాల్‌రెడ్డి సారథ్యంలో 42 అడుగుల భారీ వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే రాజీవ్‌పార్క్ వద్ద సినిమా సెట్టింగ్‌ను తలపించేలా భారీ ఏర్పాట్లు చేసి అందులో భారీ లంబోదరుడి విగ్రహాలను కొలువు దీర్చారు. అంతేకాకుండా నాగరాజు పేట, గాయత్రి టవర్స్, అప్సరా సర్కిల్, 7 రోడ్లు, పాతమున్సిపాల్టీ, కో-ఆపరేటివ్ కాలనీ, ఆలంఖాన్‌పల్లె, విజయదుర్గాకాలనీ, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాలను పలువురు భక్తులు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


రాజీవ్‌పార్కు వద్ద..



విజయవాడ వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

● కేంద్రం రూ.5 వేల కోట్లు విడుదల చేయాలి
● మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 8: విజయవాడను అల్లకల్లోలం చేసిన వరదను జాతీయ విపత్తుగా ప్రకటించి వెంటనే రూ.5 వేల కోట్ల నిధులను కేంద్రం విడుదల చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ తులసిరెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి విజయవాడ గుండెకాయ లాంటిదని, బుడమేరు వరద వల్ల తీవ్రంగా దెబ్బతిందన్నారు. మళ్లీ కోలుకోవాలంటే కేంద్రం ఉదారంగా ఆదుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుందని, రైతులు అన్నదాత సుఖీభవ పథకం అమలు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రతి ఏటా ప్రతి రైతుకు రూ.20 వేలు ఈ పథకం కింద ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొందని, ఇప్పటి వరకు పైసా ఇవ్వలేదన్నారు. కడప రేణి గుంట జాతీయ రహదారి అతి ప్రధానమైందని, చెన్నై-బొంబాయి నగరాలను అనుసంధానం చేసే రహదారి 122 కి.మీ. పొడవు ఫోర్‌లైన్ నిర్మించేందుకు రూ.2254 కోట్లు మంజూరైందన్నారు. 2023 టెండరు పూర్తయిందని, లక్ష్మీ ఇన్‌ఫ్రా సంస్థ టెండరు దక్కించుకొని 11నెలలైనా పనులు మొదలు పెట్టలేదన్నారు. 100 హెక్టార్ల అటవీ భూములకు అనుమతి రాని కారణంగా పనులు జరగడం లేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫారెస్ట్ క్లియరెన్స్ తెప్పిస్తే త్వరగా పనులు మొదలవుతాయన్నారు. అలాగే కడప- బెంగళూరు మ్యాచ్ గ్రాంట్‌ను జగన్ ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల అర్థాంతరంగా పనులు నిలిచాయన్నారు. ఈ రైలు మార్గం రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేసి పనులు పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా విజయజ్యోతి

● నగర అధ్యక్షుడిగా అఫ్జల్‌ఖాన్


విజయజ్యోతి


అఫ్జల్‌ఖాన్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 8: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా బద్వేలు నియోజకవర్గం కలసపాడు మండలానికి చెందిన విజయజ్యోతిని, నగర అధ్యక్షుడిగా అఫ్జల్‌ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ తులసిరెడ్డి ఆదివారం పేర్కొన్నారు. డీసీసీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ విజయజ్యోతి, అఫ్జల్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో జిల్లాలో, ఇటు కడపలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాములు, నగర అధ్యక్షుడిగా విష్ణుప్రీతంరెడ్డిలు పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. జిల్లా, మండల, రాష్ట్ర కమిటీల్లో, అనుబంధ విభాగాల్లో అనేక మందికి అవకాశాలు రానున్నాయన్నారు. ఈ సందర్భంగా విజయజ్యోతి, అఫ్జల్‌ఖాన్‌లను తులసిరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటా

కలసపాడు, సెప్టెంబరు 8: ప్రజా సేవకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని, ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. ఆదివారం ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలిగా తనను ఎన్నిక చేసినందుకు కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కడప జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమై, వారి సమస్యల పట్ల అధిక సమయాన్ని వెచ్చించి పేద ప్రజలకు సేవ చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు జిల్లాలోని అన్ని మండలాలు, నియోజకవర్గాలను సందర్శించి ప్రతి కార్యకర్త, నాయకులను సమన్వయపరిచి ముందుకు సాగుతామన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల కార్యక్రమం రద్దు

● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప(క్రైం), సెప్టెంబరు 8: సోమవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నందున ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలకు అనుగుణంగా ఇసుక పంపిణీ

● కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 8: జిల్లాలో ఇసుక రీచ్‌లలో ఇసుక సరఫరాను ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సజావుగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. ఆదివారం జిల్లాలో ఇసుక పంపిణీ, రవాణా, వినియోగదారుల సంతృప్తి తదితర అంశాలపై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా, కమిషనరు అండ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ శివశంకర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా, కమిషనరు ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ స్టాక్‌యార్డ్‌ల వద్ద బృందాలను ఏర్పాటు చేసి నిత్యం మానిటరింగ్ చేయాలన్నారు. ఇసుక బుకింగ్ చేసుకున్న వినియోగదారులు సంతృప్తి చెందుతున్నారా ? లేదా అని తెలుసుకోవాలన్నారు. జిల్లాలో కమాండ్ కంట్రోల్ ద్వారా వినియోగదారుల ఫిర్యాదును స్వీకరించి చర్యలు చేపట్టాలని, ఇసుక సరఫరాలో ఎక్కడా జాప్యం తగదన్నారు. ఇసుక టాస్క్‌ఫోర్సు కమిటీ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని, వీసీ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ నెల 11న ఆన్లైన్‌లో సాండ్ పోర్టల్ ప్రారంభించనున్నామని, అందుకు సంబంధించి ఇసుక యార్డుల వద్ద సంబంధిత అధికారులను ఉంచాలన్నారు. వారికి ఆన్లైన్ పోర్టల్‌పై జిల్లా ఉపాధి అధికారి, డిప్యూటీ తహసీల్దారు, ఈవోపీఆర్డీలచే శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మైన్స్ అధికారి విమలమ్మ, డీటీసీ మీరాప్రసాద్, జడ్పీసీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, నీటి పారుదల శాఖ ఎస్ఈ వెంకట్రామయ్య, హౌసింగ్ పీడీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

వైభవంగా ప్రారంభమైన బాలాలయ దర్శనం

ఒంటిమిట్ట, సెప్టెంబరు 8: కోదండరామాలయంలో ఆదివారం భక్తులకు బాలాలయ దర్శనం కల్పించారు. రెండు రోజుల పాటు బాలాలయ పూజలను టీటీడీ ఆగమ అర్చకులు రాజేష్‌బట్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 10 గంటల సమయంలో రామాలయంలోని కల్యాణమండపం వద్ద ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ముందుగా హోమగుండంలో ఉత్సవమూర్తుల నుంచి సుగంధ ద్రవ్యాలు, నవధాన్యాలు, ఆవు నెయ్యితో హోమాన్ని నిర్వహించి అనంతరం ఉత్సవ మూర్తులను రామాలయంలో ప్రదక్షిణం చేయించి ఆగమ శాస్త్ర ప్రకారం బాలాలయ సంప్రోక్షణ నిర్వహించి నూతన ఆలయంగా రామాలయం పోలిన ధ్వజ స్తంభం, బలిపీఠం నమూనాలను ఏర్పాటు చేసి అందులో విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ నవీన్, సీఐ కృష్ణంరాజునాయక్, టీటీడీ ఏఈ అమర్‌నాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

నటుడు మహేశ్ ఇంట్లో చోరీ

● రూ.10 లక్షలు నగదు, 15 తులాల బంగారు అపహరణ
● ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

పులివెందులటౌన్, సెప్టెంబరు 8: పులివెందులలో ఆదివారం మధ్యాహ్నం జిల్లాకు చెందిన నటుడు, సినీ హీరో మహేశ్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీలో రూ.10లక్షలు నగదు, 15 తులాల బంగారు నగలను దొంగలు అపహరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణంలోని షాదీ ఖానా వెనక భాగంలో 'మా ఊరి సినిమా' హీరో మహేశ్ నివశిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరూ లేనట్లు గమనించిన దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.10 లక్షలు నగదు, 15 తులాల బంగారు నగలను దోచుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కడప నుంచి క్లూస్ టీమ్‌ను రప్పించారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే అవకాశాలున్నాయని పోలీసులు తెలిపారు. కాగా పులివెందులలో ఈ మధ్యకాలంలో తరచుగా దొంగతనాలు జరుగుతుండడం విశేషం. దొంగతనాలు అరికట్టేందుకు పోలీసులు గస్తీ ఏర్పాట్లు చేయాలని పులివెందుల వాసులు కోరుతున్నారు.

కడప క్రికెట్ కేరాఫ్ హైదరాబాద్

● అవినీతి ఆక్టోపస్‌లా సెలక్టర్లు ● జగన్ పాలనలో నిబంధనలు ఉల్లంఘన
● జిల్లా క్రీడా బిడ్డలకు ఇవ్వని ప్రాధాన్యత ● 8 మంది పొరుగు రాష్ట్రం బ్యాచే


వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో ఇటీవల టెస్ట్‌మ్యాచ్‌లు జరిగిన దృశ్యం (ఫైల్)

(కడప-ఆంధ్రజ్యోతి): కడప జిల్లా క్రికెట్ సంఘం ఇప్పుడు కొందరి చేతుల్లో కీలుబొమ్మగా మారింది. జిల్లాలో ప్రతిభకు కొదవ లేని క్రీడాకారులు ఉన్నప్పటికీ సెలెక్టర్లు మేనేజ్ చేయ లేక దమ్మున్న క్రీడాకారులు కనుమరుగవుతున్నారన్న విమర్శ లున్నాయి. వెరశి పేరుకే కడప జిల్లా క్రికెట్ జట్టు అయినప్ప టికీ ఆడేదంతా హైదరాబాదు క్రీడాకారులే. కడప సెలక్షన్ కమిటీలో ఒకప్పుడు కీ రోల్‌గా ఉన్న కొందరు ఇప్పుడు హైద రాబాదు వెళ్లి అక్కడ వాళ్లనే ఇప్పుడు కడప జిల్లా క్రికెట్ తర పున ఆడిస్తుండడం జిల్లా క్రీడాకారులకు సిగ్గుచేటుగా మారిం ది. కడప జిల్లా జట్టులో సగం మందికి పైగా ఇప్పుడు హైద రాబాదు క్రీడాకారులే ఉండడం తీవ్ర దుమారం రేపుతోంది. ప్రస్తుతం యువతలో విపరీతమైన మక్కువ ఉన్న క్రీడ క్రికె ట్. పాఠశాలలకు, కళాశాలలకు సెలవు రోజు వచ్చిందంటే ప్రతి ఒక్కరూ బ్యాట్, బాల్ పట్టి మైదానంలో క్రికెట్ ఆడాల్సిందే. అయితే శిక్షణ పొంది ప్రతిభ కనబరిచినప్పటికీ జట్టులో ఎంపిక కాకపోవడంతో నిరుత్సాహానికి గురై అసోసియేషన్‌లో జరుగుతున్న అక్రమాలను కళ్లప్పగించి చూస్తూ ఏమీ చేయలేక వెనుదిరిగిన క్రికెట్ క్రీడాకారులు జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది ఉన్నారు.

జిల్లాలో సబ్ సెంటర్లు

ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట, నందలూరు, కడప, బ్రహ్మంగారిమఠం, ప్రొద్దుటూరులలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి యువకులకు క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. క్రీడాకారులు శిక్షణలో మెరుగైన ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపిక కావాలన్న ఆశతో ప్రతి యేటా జరిగే సెలక్షన్స్‌కు వచ్చి ప్రాబబుల్స్‌లో వెనుదిరిగే వారు కొందరైతే, జట్టులో స్థానం దక్కినా లెవెన్‌లో స్థానం దక్కకపోవడంతో నిరుత్సాహంగా మ్యాచ్‌లను చూసి ఇంటికి తిరిగి వెళ్లేవారు మరికొందరు. తాము ఎంత కష్టపడ్డా జిల్లా జట్టులో స్థానం దక్కకపోవడానికి కారణమేంటో తెలియక క్రీడాకారులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రతి విభాగంలోనూ సగం పైబడి హైదరాబాదీలే

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అండర్-14, 16, 19 విభాగాల్లో సెలక్షన్స్ నిర్వహిస్తారు. జిల్లా టీంకు ఎంపికైన వారిని జిల్లాస్థాయి క్రీడా పోటీలకు పంపుతారు. అయితే ప్రతి విభాగంలో జట్టులో హైదరాబాద్ క్రీడాకారులు దాదాపు ఏడుగురు పైన ఉంటే ముగ్గురు, నలుగురు మాత్రమే జిల్లా క్రీడాకారులుంటారు. జిల్లా సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచినప్పటికీ మిగిలిన వారందరినీ స్టాండ్‌బైలో ఉంచి, మ్యాచ్ జరిగేటప్పుడు క్రీడాకారులకు వాటర్ బాటిల్స్ అందిస్తూ మరో సంవత్సరమైనా జట్టులో స్థానం దక్కకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రతి సంవత్సరం ఇదో తంతుగా మారిందని ఆవేదన చెందుతున్నారు.

క్రికెట్ అకాడమీలతో అటాచ్‌మెంటే కారణమా

జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో అగ్రస్థానంలో ఉన్న కొందరు హైదరాబాదుకు చెందిన క్రికెట్ అకాడమీలతో సంబంధాలు పెట్టుకుని అక్కడ శిక్షణ పొందుతున్న క్రీడాకారులను జిల్లా జట్టులో ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ తతంగమంతా భారీ ముడుపులతోనే జరుగుతున్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ ప్రశ్నించే నాథుడే కరువయ్యారు.

ప్రశ్నిస్తే వేటు

జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెలెక్షన్స్‌లో జరుగుతున్న అవినీతిపై క్రీడాకారుల తల్లిదండ్రులు కానీ, క్రీడాకారులు కానీ ప్రశ్నిస్తే వారిపై సస్పెన్షన్ వేటు వేస్తారు. క్రీడాకారులకైతే ఏళ్ల తరబడి జట్టులో స్థానం దక్కకుండా హింసకు గురి చేస్తారు. లేదా తల్లిదండ్రులు ఎవరైనా ప్రశ్నిస్తే వారికి రకరకాల కారణాలు చెప్పి వారిని మాట్లాడకుండా చేయడంలో సదరు అసోసియేషన్ సభ్యులు దిట్టగా పేరుగాంచారు. దీంతో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్ని అక్రమాలు జరిగినా ప్రశ్నించే సాహసం ఎవరూ చేయలేకపోయారు. ప్రశ్నించినా ఉపయోగం లేదంటూ కొందరు మిన్నకుండిపోయారు.


ప్రభుత్వం మారినా.. తీరు మారలేదు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో క్రికెట్ అసోసియేషన్‌లో అక్రమాలు నెరిపిన వారందరూ టీడీపీ అధికారంలోకి వచ్చినా అక్రమాలు చేసేందుకు ఏ మాత్రం వెనుకాడడం లేదు. అండర్-19 సెలక్షన్స్ మ్యాచ్‌లు జరగాల్సిన సమయం ఉన్నప్పటికీ హడావుడిగా ఎన్నికల ఫలితాలు రాకముందే చకచకా సెలక్షన్స్ జరిపి మ్యాచ్‌లను కూడా ముగించారు. ఇందులో దాదాపు తమకు సంబంధించిన హైదారాబాదు ఆటగాళ్లకు స్థానం కల్పించి తమ అక్రమాలకు ఎదురే లేదన్న రీతిలో వ్యవహరించారు.

వన్డేమ్యాచ్‌లు అనంతపురంలో పూర్తయిన తరువాత టెస్ట్ మ్యాచ్‌లకు సెలక్షన్స్ జరిపి సెలక్షన్స్‌లో ఎంపికైన వారినే జట్టులో స్థానం కల్పించాల్సి ఉండగా, ఆ నిబంధనలు తుంగలో తొక్కి దాదాపు 27 మందిని జట్టులో ఉంచి జరిగిన అన్ని మ్యాచ్‌లలో వారికి కావాలసిన హైదరాబాదీలను ఉంచుకుని ప్రతి మ్యాచ్‌లో జట్టును మారుస్తూ తమకు కావాలసిన వారందరికీ స్థానం కల్పించి అవినీతికి అడ్డే లేదని నిరూపించుకున్నారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో మార్పు అవసరం

జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లో మార్పు అవసరమని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ప్రస్తుతం ఉన్న వారే ఉంటే జిల్లాలోని క్రీడాకారులు క్రికెట్ క్రీడను వదలేయాల్సిన పరిస్థితులు దాపురిస్తాయని, క్రికెట్ అసోసియేషన్‌లో అవినీతికి పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టి అసోసియేషన్‌లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.



క్రికెట్.. ఈ పదం మనోళ్లలో ఓ తెలియని వైబ్రేషన్. వయస్సుకు అతీతంగా ఇష్టపడే గేమ్. అందుకే క్రికెట్ వస్తుందంటే చాలు వృద్ధుల నుంచి యువకుల వరకూ అటు టీవీ, ఇటు మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతారు. ఇప్పుడు క్రికెట్ అనేది జనరల్ గేమ్. తమ పిల్లలు కూడా క్రికెట్ ఆడాలని, జాతీయ జట్టుకు ఎంపిక కావాలని తల్లిదండ్రులు ఆశిస్తుంటారు. వారి స్థోమతకు మించి క్రికెట్ శిక్షణలో పిల్లల కోసం ఖర్చు పెడుతుంటారు. అయితే క్రికెట్ సెలక్షన్స్‌లో ప్రతిభకు ప్రాధాన్యతనివ్వాల్సిన సెలెక్టర్లు పార్టీ, కులం, క్యాష్ చూస్తూ క్రికెట్‌ను అవినీతిమయంగా మార్చారు. ఒకవైపు బెట్టింగ్‌లతో గేమ్ చెడిపోతుంటే, మరోవైపు ఆటగాళ్ల ఎంపికలోనూ డబ్బు, సిఫారసులను ప్రాధాన్యతగా చూడడంతో తీవ్ర దుమారం రేపుతోంది. జిల్లాలోని క్రీడాకారులను పక్కనబెట్టి పరాయి రాష్ట్రమైన హైదరాబాదు నుంచి వచ్చిన క్రీడాకారులను జట్టులోకి తీసుకోవడం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అక్రమాలకు నిదర్శనంగా మారింది.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి


మహేశ్ మృతదేహం

రాయచోటి టౌన్, సెప్టెంబరు8: స్థానిక చిత్తూరు రోడ్డులో టీవీఎస్ షోరూం వెనుక భాగాన వినాయక మండపం వద్ద విద్యుదాఘాతంతో మహేశ్ (12) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే.... ప్రకాశం జిల్లా దర్శి వాసి వల్లారమ్మ కుటుంబం సంచార జీవనం గడుపుతూ స్టీల్ వస్తువులు విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో వల్లారమ్మ పెద్ద కుమారుడు రాయచోటి ప్రాంతంలో వివాహం చేసుకుని ఇక్కడే నివాసం ఉండడంతో వల్లారమ్మ కూడా పిల్లలతో కలిసి రాయచోటిలోనే పది నెలలుగా ఉంటోంది. ఈ క్రమంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని టీవీఎస్ షోరూం వెనుక వైపున వినాయక ప్రతిమ ఏర్పాటు కోసం మండపాన్ని సిద్ధం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వినాయకుడి ప్రతిమ తీసుకొచ్చిన అనంతరం పిల్లలంతా కలిసి అక్కడ డీజే డాన్స్ ప్రోగ్రాం చేస్తున్నారు. ఇంతలో ఓ మోస్తారు వర్షం కురుస్తుండడంతో మండపానికి ఏర్పాటు చేసిన డెకరేషన్ విద్యుత్ వైరు కడ్డీకి తగిలి మహేశ్ మృతి చెందాడు. బాలుడు మృతి చెందడంపై తల్లి వల్లారమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డి తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు....


షేక్ షారిక్ మృతదేహం

వల్లూరు, సెప్టెంబరు 8: కడప - తాడిపత్రి హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ షారిక్ (13) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కడప అల్మాస్‌పేట వాసులు ముగ్గురు ద్విచక్ర వాహనంలో కమలాపురం నుంచి కడపకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న వ్యక్తి గుద్దడంతో కమలాపురం నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనంలో ముగ్గురు ఉండగా వెనక కూర్చున్న షేక్ షారిక్ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఇతని తండ్రి మహ్మద్ అబ్దుల్ షరీఫ్ గల్ఫ్‌లో ఉన్నట్లు వారి మేనమామ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే దాని పట్ల అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో పొలతల భజంత్రీ మధుబాబు....



పెండ్లిమర్రి, సెప్టెంబరు 8: పొలతల మల్లేశ్వరస్వామి ఆలయంలో పని చేస్తున్న జి.మధుబాబు (భజంత్రి) అనారోగ్యంతో మృతిచెందారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎం.కృష్ణానాయక్, ఎస్.రాజారెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలకు దేవస్థానం తరపున రూ.15000 అందించారు.

కుక్కల దాడిలో జింక మృతి


జింక కళేబరం

రామాపురం, సెప్టెంబరు8: కుక్కల దాడిలో ఏడాది వయసున్న జింక శనివారం మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ భరణికుమార్ తెలిపారు. శనివారం అటవీ ప్రాంతం నుంచి కిందికి రావడంతో కుక్కలు వెంబడించి రామాపురం మండల కేంద్రానికి సమీప సరస్వతిపల్లె క్రాస్ రోడ్డు ప్రాంతంలో కుక్కల దాడిలో జింక మృతి చెందిందన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు జింకను స్వాధీనం చేసుకుని ఆదివారం పశువుల వైద్యాధికారి మహేశ్ పోస్టుమార్టం జరిపిన అనంతరం ఫారెస్టు సిబ్బంది అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి ఖననం చేసినట్లు ఆయన తెలిపారు.

సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి

- ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 8: ఆశా కార్యకర్తలకు కనీస వేతనంగా రూ.26వేలు ఇవ్వాలని, వైసీపీ ప్రభుత్వంలో ఆశాల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలోని ఒప్పంద జీఓలు విడుదలయ్యేవరకూ ఆశా వర్కర్ల రిటైర్మెంట్లను నిలపాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ మాట్లాడుతూ జిల్లాలోని మొరగుడి, తాళ్ళపల్లి, పెద్దముడియం, ఇతర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు పని చేయాలని మెడికల్ ఆఫీసర్లు ఆశాలను ఒత్తిడి చేస్తున్నారని చెయ్యకపోతే ఉద్యోగాలు మానుకోవాలన్నారు. మెమోల ద్వారా వేధించడం మానుకోవాలన్నారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, మహిళా నాయకురాలు వరలక్ష్మి, అనసూయ, అమ్ములు, అనిత, సుధారాణి, పలువురు పాల్గొన్నారు.

వరద బాధితులకు అంజుమన్ సహాయం

రూ.10 లక్షల నగదు, 4 టన్నుల బియ్యం సహా సామగ్రి


మాట్లాడుతున్న వీఎస్ ముక్తియార్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 8: విజయవాడ వరదబాధితుల సహాయం కోసం అంజుమన్ అహలే ఇస్లాం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు మసీదుల్లో విరాళాలు సేకరించినట్లు మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ హాల్లో మసీదుల నుంచి సేకరించిన బియ్యం కందిబేడలు, ఇతర సామగ్రిని అంజుమన్ కమిటీ సభ్యులు పరిశీలించారు. సోమవారం ఉదయం వీటిని విజయవాడలోని వరదబాధితులకు అందజేయడం కోసం ఇక్కడి నుంచి లారీలో వీటిని తరలిస్తామని తెలిపారు. పట్టణంలోని ముస్లింలు స్వర్ణకారులు మార్కెట్ వ్యాపారులు అందరు కలిసి దాదాపు 10 లక్షలకు పైగా నగదు విరాళాలు ఇచ్చారన్నారు. ఆపదలో వున్న మనుషులకు ఆదుకోవడం మానవధర్మం అన్నారు. ప్రాంతాలు ఏవైనా మనుషులకు కష్టం వస్తే వారిని కుల మత ప్రాంతాలకు అతీతంగా సహాయం చేయడం ఆదుకోవడం అభినందనీయమన్నారు. అంజుమన్ అహలే ఇస్లాం అధ్యక్షుడు బొల్లారం బాషా మాట్లాడుతూ విజయవాడలో వచ్చిన వరదలతో జనజీవనం అతలాకుతలమైందన్నారు. ప్రభుత్వం చేసే సహాయ కార్యక్రమాలు, మానవ సమాజం స్పందించాలన్నారు. అందులో భాగంగా అంజుమన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించామన్నారు. వీటిని కలెక్టరుకు అందజేస్తామన్నారు. వీటిని సోమవారం తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంజుమన్ మాజీ అధ్యక్షుడు ఇక్బాల్, సీనియర్ న్యాయవాది దాదాపీర్, మాజీ ఖాజీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

నల్లపురెడ్డిపల్లెలో ఇద్దరికి తీవ్ర గాయాలు - 10 దూడలు మృతి


చికిత్స పొందుతున్న చంద్రకళమ్మ

పెనగలూరు, సెప్టెంబరు 8: నల్లపురెడ్డిపల్లె పంచాయతీలో ఆదివారం తెల్లవారు జామున పిచ్చికుక్క స్వైరవిహారం చేసి చంద్రకళమ్మ అనే వృద్ధురాలిని తీవ్రంగా గాయపరచడంతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. హరిజనవాడలో చిన్నయ్యపై దాడి చేయడంతో ఆయన చేతికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఐదు రోజులుగా గ్రామంలో చేసిన దాడిలో ఇప్పటికే 10 దూడలు మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. లెక్కలేనన్ని కోళ్లను చంపిందని తెలిపారు. ఇంట్లో నిద్రిస్తున్న చంద్రమ్మపై దాడిచేసి కాళ్లు, చేతులపై తీవ్రంగా గాయపరచడంతో ఆమె పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. ఆమెను రాజంపేట ఆస్పత్రికి అక్కడి నుంచి కడపకు, కడప నుంచి తిరుపతికి రెఫర్ చేయడం, పరిస్థితి ఆందోళనకరంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు కుక్కలపై చర్యలు తీసుకుని వాటిని పట్టుకుని ప్రజలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యం



సమస్యల నడుమ ఝురికోన ప్రాజెక్టు ● మరమ్మతులకు ఎదురు చూపులు

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సుండుపల్లి, సెప్టెంబరు 8: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా సుండుపల్లి మండల రైతుల పరిస్థితి తయారైంది. ఝురికోన ప్రాజెక్టులో నీరున్నా నిరుపయోగంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో ఝురికోన ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైంది. కనీసం కాల్వల నిర్మాణానికి కూడా నోచుకోక పోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కూమార్ రెడ్డి పాలనలో జలాశయం నుంచి కంభంవారిపల్లి, కలికిరి తదితర మండలాలకు తాగునీటి పథకం మంజూరు చేసి పూర్తి చేశారు. సుండుపల్లి రైతాంగం కోసం బాహుదానదిలో కాల్వలు ఏర్పాటు చేయని కారణంగా ఈ ప్రాంతీయులకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. కొన్నేళ్లగా పూర్తి చేస్తామని ప్రజాప్రతినిధుల హామీలు నీటిమీద రాతలయ్యాయి. జలాశయం తూము మరమ్మతులకు గురై ఏడేళ్లయినా పనులు జరగక పోవడం గమనార్హం. వివరాల్లోకెళితే....

అన్నమయ్య జిల్లాలోని సుండుపల్లి, సంబేపల్లి ప్రాంతాల తాగు, సాగునీటి కోసం ఝురికోన ప్రాజెక్టు నిర్మించారు. అయితే సుండుపల్లి రైతాంగం కోసం బాహుదానదిలో కాల్వలు ఏర్పాటు చేయని కారణంగా ఈ ప్రాంత ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. ప్రాజెక్టు దిగువ భాగంలో సాగు నీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పట్లో బాహుదా జలసాధన జలసంరక్షణ సమితి పోరాటాలతో తూమును ఏర్పాటు చేశారు. దాదాపు ఏడేళ్ల కిందట తూముగేటుకు ఏర్పాటు చేసిన అనుబంధ కడ్డీ విరిగి పోయింది. అప్పట్లో గేటు తొలగించి బాహుదా నదిలోకి నీరు పోకుండా, ప్రాజెక్టులో నీరు నిలిచేలా తూములోకి నీరు రాకుండా కాంక్రీటు వేశారు. ఏడేళ్లవుతున్నా గేటు మరమ్మతులను పట్టించుకోలేదు. కరవుతో రైతులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈ ఏడాది జూలైలో కరవు పరిస్థితులతో సాగు నీరులేక ఇబ్బందులు పడుతున్నామని కూటమి నేతలు, నీటి పారుదలశాఖ అధికారుల దృష్టికి సుండుపల్లి మండల రైతులు తీసుకుపోయి నదిలోకి సైఫన్ పద్ధతిలో ప్లాస్టిక్ పైపుల ద్వారా నీటిని విడుదల చేశారు. జలాశయ నీరు దిగువకు వచ్చేలా చేశారు. 15 రోజుల తరువాత గుర్తుతెలియని వ్యక్తులు ప్లాస్టిక్ పైపులను కత్తిరించారు. కాల్వల నిర్మాణానికి ఆలస్యమైనా గేటు ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ నిర్లక్ష్యం..రైతులకు శాపం

దశాబ్దలుగా కాల్వల ఏర్పాటు కలగానే మిగిలింది. ప్రత్యక్షంగా 5 వేల ఎకరాల సాగుభూమికి నీటిని అందించే అవకాశంవున్నా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఎటువంటి ముందడుగు పడలేదు. అప్పట్లో కనీసం సమస్యను అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఎంపీ, ఎమ్మెల్యేలు తీసుకుపోలేక పోయారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారేకానీ ప్రయోజనం లేకుండా పోయింది. ఎన్ని సార్లు రైతులు, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు వినతులు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. కాల్వలు ఏర్పాటైతే మండలంలోని సగం మంది రైతులకు సాగు నీటి సమస్య లేకుండా పోతుంది. ఇదంతా తెలిసినా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాల్వలు ఏర్పాటు చేయాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

నూతన వ్యయంతో ప్రతిపాదనలు

ఏడాది కిందట రూ.59 లక్షలతో ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నుంచి అప్పట్లో అనుమతులు రాలేదు. ప్రభుత్వం మారింది. నూతన వ్యయంతో ప్రతిపాదనలు పంపించాల్సి వుంది. త్వరలో ప్రతిపాదనలు పంపి గేటు పునరుద్ధరణకు కృషి చేస్తాము. ఉన్నతాధికారులకు సమస్యను తెలియజేశాము.
వెంకట్రామయ్య,
కార్యనిర్వహణాధికారి, జిల్లా జలవనరులశాఖ


మట్టి, కాంక్రీట్‌తో తూము మూసిన వైనం


మరమ్మత్తులకు నోచుకోని తూము గేటు

అనుమతించారు - అడ్డుకున్నారు

కడప రిమ్స్ దంత వైద్యశాల ఆవరణ డీజే సౌండ్ ● డీజేలను ఆపివేయాలన్న పోలీసులు

పోలీసులతో వాగ్వాదం ● ఆందోళన చేసిన వైద్యవిద్యార్థులు

కడప డీఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్

కడప (క్రైం), సెప్టెంబరు 8: చవితి వేడుకలో భాగంగా ప్రభుత్వ దంత వైద్య కళాశాల ఆవరణలో పోలీసుల అనుమతితోనే వినాయకుని ప్రతిమను ఏర్పాటు చేసుకుని డీజేలు పెట్టుకున్నామని, పోలీసులు వచ్చి రావడంతోనే తమను అడ్డుకున్నారని వైద్యవిద్యార్థులు ఆరోపించారు.

కడప నగరం రిమ్స్ ప్రభుత్వ దంత వైద్య కళాశాల ఆవరణలో వైద్యవిద్యార్థులు వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ డీజేలు ఏర్పాటు చేయడంతో రిమ్స్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన చివరికి ఆందోళనకు దారి తీసింది. పోలీసులు అనుమతితోనే తాము వినాయక ప్రతిమను ఏర్పాటు చేసుకుని డీజేలు పెట్టుకున్నామని, పోలీసులు వచ్చి రావడంతోనే తమను అడ్డుకున్నారని వైద్యవిద్యార్థులు ఆరోపించారు. దీంతో ఔట్ పోస్టు పోలీసుస్టేషన్ వద్ద వైద్యవిద్యార్థులు ఆందోళనకు దిగారు. పోలీసు అధికారిపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తమ వంతు కృషి చేశారు. పెద్దపెద్ద సౌండ్‌లతో డీజే సౌండ్‌లో పాటలు పెట్టి రోగులకు ఇతర ఆస్పత్రిలో ఉన్న వారికి ఇబ్బందులు కలుగుతాయని ఎస్ఐ సౌండు తగ్గించాలని సూచించడంతో ఈ సంఘటనలు జరిగినట్లు తెలుస్తోంది. దీంతో ఆదివారం పోలీసులు, వైద్య విద్యార్థులు, వారి అధికారులను అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు కడప డీఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. అనంతరం ఇరువైపులా విచారించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 8: స్థానిక బైపాస్‌రోడ్డులో శనివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి బి.వెంకటేశ్వర్లు(39) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గొల్లపల్లె వాసి వెంకటేశ్వర్లు తన స్నేహితుడితో వినాయకుడి బొమ్మను తీసుకువెళ్లేందుకు బద్వేలుకు వచ్చారు. బొమ్మను తీసుకువెళుతుండగా ప్రమాదవశాత్తు వెంకటేశ్వర్లు ట్రాక్టర్‌కింద పడ్డాడు. స్నేహితులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

ఎస్పీ బంగ్లా వద్ద కూలిన కటౌట్

తృటిలో తప్పిన ప్రమాదం


రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కటౌట్

కడప (క్రైం), సెప్టెంబరు 8: కడప నగరంలోని ఎస్పీబంగ్లా నుంచి రాజారెడ్డివీధి వైపు వెళ్లే రోడ్డు ప్రారంభంలోనే కుడివైపున వినాయకచవితి శుభాకాంక్షలు పేరుతో ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ఆదివారం మధ్యాహ్నం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో వాహనాలు కానీ, వాహనదారులు, పాదచారులు కానీ ఆ దారిన ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. సంఘటన జరిగిన వెంటనే స్థానికంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు హడావుడిగా వచ్చి కడప నగర పాలక సంస్థ వారికి సమాచారం ఇచ్చారు.

పది మంది జూదరుల అరెస్ట్

వీరబల్లి, సెప్టెంబరు8: హరిజనవాడ, రాగిమానిదిన్నెపల్లె సమీపంలో జూదమాడుతున్న పదిమందిని అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు. అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వంగిమళ్ల పంచాయతీ పెద్ద హరిజన వాడ వద్ద జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2600 నగదును, సంఘంవాండ్లపల్లె పంచాయతీ రాగిమానిదిన్నెపల్లె వద్ద ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1800 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓ నేతపై దుండగుల రెక్కీ ?

కడప (క్రైం), సెప్టెంబరు 8: కడప నగరం అల్మాస్‌పేటలో షోరూం నిర్వహిస్తున్న ఓ నేతపై దుండగులు రెక్కీ నిర్వహించారంటూ అర్ధరాత్రి పోలీసులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారించగా, అలాంటి దేమీ జరగలేదంటూ పోలీసులు భావిస్తున్నారు. తనపై దాడి చేస్తారని తన అనుచరులకు వచ్చిన ఫోన్ సమాచారం వరకే పోలీసుల దృష్టికి తెచ్చినట్లు ఆ నేత అధికారులకు వివరించినట్లు సమాచారం. ఎవరు, ఎందుకు రెక్కీ నిర్వహించారో స్పష్టమైన సమాచారం ఎవరి వద్ద లేనట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఆ ఎనిమిదిన్నర సెంట్లు ఏమైనట్లు?

కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్న మాజీ సర్పంచ్


ఆక్రమణకు గురైన పాఠశాల స్థలం ఇదే

చెన్నూరు, సెప్టెంబరు 8: కొండపేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎనిమిదిన్నర సెంట్లు ఆక్రమణకు గురైంది. దీంతో పాఠశాలకు ఆటస్థలం లేకుండాపోయింది. దాతలు ఇచ్చిన పదహైదున్నర సెంట్ల స్థలంలో కేవలం ఏడుసెంట్లు మాత్రమే ఉండడం, మిగతా ఎనిమిదిన్నర సెంట్లు లేకపోవడంతో మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి సోమవారం కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నారు. దశాబ్దాల కిందట ఏర్పాటైన ప్రాథమిక పాఠశాలకు గతంలో 1971న 185/6లో 10 సెంట్లను కె.పెద్దసుబ్బయ్య, 185/6లో మరో దాత 3 సెంట్లు, 1984లో ఖాదర్‌మొహిద్దీన్‌సాబ్ రెండున్నర సెంట్లను పాఠశాలకు విరాళంగా ఇచ్చారు. అందులో పాఠశాల నిర్మాణం అయింది. దాదాపు 50 ఏళ్లుగా నడిపే ఈ పాఠశాలకు సంబంధించి పదహైదున్నర సెంట్లలో క్రమేపీ ఎనిమిదిన్నర సెంట్లు ఆక్రమణకు గురి కాగా ఏడుసెంట్లు మాత్రమే మిగిలాయి. అందులో పాఠశాల, అంగన్వాడీ కేంద్రం నిర్మించారు. దీంతో ఆక్రమణకు గురైన స్థలం ఏమైందీ, తిరిగి దానిని పాఠశాలకు ఇప్పించేలా చూడాలని మాజీసర్పంచ్ మోహన్‌రెడ్డి కలెక్టరుకు సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఈ సమస్యను మండల టీడీపీ నేతగా తాను ఎమ్మెల్యే పుత్తాచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణగురైన స్థలాన్ని తిరిగి పాఠశాలకు ఇప్పించాలని గతంలో ఎమ్మెల్యేకు తెలిపినట్లుగా ఆయన అన్నారు.

వరాలతల్లి... మరియ

ఆరోగ్యమాత ముగింపు ఉత్సవాల్లో బిషప్ గాలి బాలి


బిషప్ గాలి బాలిని సత్కరిస్తున్న ఫాదర్లు

కడప (కల్చరల్) సెప్టెంబరు 8: విశ్వాసులకు దీవెనలు, పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించే వరాల తల్లి మరియ అని కడప అపోస్తులిక పాలన అధికారి, బిషప్ గాలి బాలి అన్నారు. పది రోజులుగా ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం నవదిన పూజా ప్రార్థనలు జరిగాయి. చివరిరోజు ఆదివారం ముగింపు ఉత్సవాల్లో ఆయన ఆరోగ్యమాత సందేశాన్ని అందించారు. కడప నగరంలో ఆరోగ్యమాత వెలసి వుండడం రాయలసీమ ప్రాంతానికే ఆశీర్వాదకరమన్నారు. ఆరోగ్యమాత నవదిన పూజా ప్రార్థనలకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా విశ్వాసులు హాజరై దీవెనలు అందుకోవడం సంతోషంగా వుందన్నారు. ఆ తల్లి శరణుకోసం పవిత్ర మనసుతో రోజూ కుటుంబాల్లో ప్రార్థన, జపమాల చేయాలని కోరారు. అనంతరం గాలిబాలికి గురువులు, అమ్మవార్లు, చర్చిపెద్దలు, యువత, శాలువా, గజమాలతో శాంతిసేవా సొసైటీ జ్ఞాపికతో సత్కరించారు.

కార్యక్రమంలో మేత్రాసన వికర్ జనరల్ ఫాదర్ బాలరాజు, కోశాధికారి ఫాదర్ సురేష్, పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ప్రసాద్‌రావు, మేత్రాసన గురువులు, అమ్మవార్లు, మేత్రాసన ఉజ్జీవక ఉపదేశులు, చర్చిపెద్దలు, యువత, అధికసంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో స్థలాల వివాదం


బేస్‌మెంట్ రాళ్లు పక్కన పడవేసిన దృశ్యం

జమ్మలమడుగు, సెప్టెంబరు 8: గండికోటకు వెళ్లే దారి ఒంటిమిద్దె గ్రామ సమీపాన ప్రధాన రోడ్డు పక్కన పూర్వపు బొమ్మేపల్లె జగనన్న లేఅవుట్ స్థలాల్లో ఆదివారం వివాదం చోటు చేసుకుంది. సీఐ లింగప్ప వివరాల మేరకు బొమ్మేపల్లె వాసులు ముద్రా రాజశేఖర్‌రెడ్డి, హరినాథరెడ్డి సహా మరో నలుగురు జగనన్న లేఅవుట్‌లో ఎక్స్‌కవేటర్‌తో బేస్‌మెంట్ రాళ్లను పునాది కోసం తీసిన మట్టి, రాళ్లను పెకిలించినట్లు పలువురు గ్రామస్థులు స్టేషన్ వద్దకు వచ్చి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వెంటనే సమస్యను పరిశీలించేందుకు తమ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు సీఐ తెలిపారు. అక్కడ పెద్దబాలిగారి లక్ష్మీదేవి, దేవి బేస్‌మెంట్, పునాది రాళ్లకు సంబంధించి పక్కకు తీసి పడవేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. సర్వే నంబరు 381, 382లో 180 ప్లాట్లు అప్పట్లో అధికారులు లేఅవుట్లు వేసినట్లు 40 నుంచి 44 మందికి పట్టాలు ఇచ్చినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. అయితే సీఐ లింగప్ప, ఎస్ఐ రామకృష్ణ గ్రామస్థులతో మాట్లాడి ప్రస్తుతం ఇచ్చిన ఫిర్యాదును పరిశీలిస్తామని తహసీల్దారు శ్రీనివాసరెడ్డి విజయవాడకు వెళ్లాడని, మూడు రోజులు గడువు ఇస్తున్నామని తహసీల్దారు వచ్చిన వెంటనే పట్టాలకు సంబంధించి రికార్డు పరిశీలించి జరిగిన ఘటనకు సంబంధించి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కల్పన, పోలీసు సిబ్బంది, బొమ్మేపల్లె బాధిత ప్రజలు పాల్గొన్నారు.

'పొలానికి రీసర్వే నిర్వహించాలి'

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 8: బొజ్జవారిపల్లెలో ఉన్న తమ పొలానికి రీ సర్వే నిర్వహించాలని బుర్రి బాలయ్య కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వే నంబరు 291/1బి, 291/2బిలలో 73 సెంట్ల పొలం ఉందన్నారు. జగనన్న సర్వేలో తనకు 4 సెంట్లు స్థలం వస్తుందని సర్వేయర్ చెప్పారని తెలిపారు. అయితే కొత్త పొలం యజమానుల ఒత్తిడితో సర్వేయర్, వీఆర్వోలు హడావిడిగా సర్వే నిర్వహించి తమ భూమిని 10 సెంట్లు ఆక్రమించి సరిహద్దు రాళ్లు పాతడం దారుణమన్నారు. వీఆర్వో, సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు, ఆర్డీఓలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి పొలానికి రీ సర్వే చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బుర్రి బాలయ్య సతీమణి వెంకటసుబ్బమ్మ, కుమారుడు నాగేంద్ర పాల్గొన్నారు.

శివశివ మూర్తివి గణనాథా..




కడప పాత మున్సిపల్ కార్యాలయం వద్ద చవితి సంబరాలు.. ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో మట్టి గణేషుడు



కడప: గాయత్రి టవర్స్ వద్ద వినాయక పూజలో పాల్గొన్న గోవర్ధన్‌రెడ్డి



కడప ఎన్జీఓ కాలనీ వద్ద వినాయక కమిటీ సభ్యులు



కడప తాలుకా పోలీస్‌స్టేషన్ వద్ద గణపతి పూజలు

కడప (కల్చరల్), సెప్టెంబరు 8: 'శివశివ మూర్తివి గణనాథా.. నువ్వు శివుని కుమారుడవు గణనాథా' అంటూ భక్తులు వినాయకుని పూజించారు. ఆదివారం చవితి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తాము తలపెట్టే కార్యాలు నిర్విఘ్నంగా కొనసాగేలా ఆశీర్వదించాలని స్వామిని వేడుకున్నారు.

కడప నగరంలో... కడప నగరం ఎన్‌జీవో కాలనీలో వినాయక ఉత్సవ కమిటీ చైర్మన్ అందూరి రాజగోపాల్‌రెడ్డి సారథ్యంలో 42 అడుగుల భారీ వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. రాజీవ్ పార్క్ వద్ద భారీ సెట్టింగులను ఏర్పాటు చేశారు. నాగరాజుపేట, గాయత్రి టవర్స్ అప్సరా సర్కిల్, ఏడు రోడ్లు, పాతమున్సిపాలిటీ, కో-ఆపరేటివ్ కాలనీ, ఆలంఖాన్‌పల్లె, విజయదుర్గాకాలనీ, తదితర ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహాలను పలువురు భక్తులు దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 9వ డివిజన్ ఆర్టీఓ కార్యాలయ సమీపంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యురాలు గౌరీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు జీవీ రమణ, మాలే శివ హాజరై అన్నదానం చేశారు.

ఆలంఖాన్‌పల్లెలో...
కడప నగరం 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలో పలుచోట్ల వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆయా విగ్రహాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

కమలాపురం: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి వివిధ మండలాల్లోని పలు విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి చావిటి వద్ద చెన్నూరు, వల్లూరు, పెండ్లిమర్రి, సీకేదిన్నె ప్రాంతాల్లో వినాయక విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు.

వేంపల్లె: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ గణపతి పూజలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పీసీసీ మీడియా మాజీ చైర్మన్ తులసిరెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచు ఆర్ శ్రీను, టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, గణపతి వేడుకల్లో పాల్గొన్నారు.

వల్లూరు: వల్లూరులో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

చెన్నూరు: చెన్నూరులో ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా యువత, పెద్దలు, చిన్నారులు ఊరేగింపులో సందడి చేశారు. అలాగే పలుచోట్ల వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సింహాద్రిపురం: మండల వ్యాప్తంగా పోలీసుల సమాచారం మేరకు 80 వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. అన్నదానం విరివిగా ఏర్పాటు చేశారు.

పులివెందుల: పట్టణంలో పలు చోట్ల విగ్రహాలు ఏర్పాటు చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అలాగే నేడు కొన్ని విగ్రహాలను వినాయక నిమజ్జనం చేయనున్నారు.

సీకేదిన్నె: మండల వ్యాప్తంగా వినాయక చవితిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల వద్ద ప్రత్యేక అలంకరణ చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కడప తాలుకా పీఎస్‌లో..
కడప (క్రైం), సెప్టెంబరు 8 : కడప తాలుకా పోలీసుస్టేషన్‌లో తాలుకా ఇన్‌స్పెక్టరు వెంకటేశ్వర్లు ఘనంగా విఘ్నేశ్వరుడికి వినాయక చవితి పూజలను నిర్వహించారు. పోలీసుస్టేషన్‌లో స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి స్టేషన్ సిబ్బందితో సహా అందరూ పాల్గొని విఘ్నేశ్వరుడికి ఘనంగా పూజలు నిర్వహించారు.



వీఎన్‌పల్లె : పూజలందుకుంటున్న గణనాథుడు



పులివెందుల: హనుమాన్ నగర్‌లో వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అలంఖాన్‌పల్లె రాణితోటలోని రాముల గుడి వద్ద అలంకరణలో గణేషుడు



ఏడు రోడ్ల వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద కమిటీ సభ్యులు



సింహాద్రిపురంలో పూజలు చేస్తున్న మహిళలు



చెన్నూరులో వినాయకుని ఊరేగింపు



చింతకొమ్మదిన్నెలో వినాయక పూజలు



కమలాపురం: గణనాధుని వద్ద పూజలు చేస్తున్న పుత్తా, చైతన్యరెడ్డి

టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన పుత్తా

కమలాపురం రూరల్, సెప్టెంబరు 8 : కమలాపురం మండల పరిధిలోని పెద్దచెప్పలి గ్రామంలో నివాసం ఉన్న తోట వెంకటేశ్వర్లును టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు. తోట వెంకటేశ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. హాస్పిటల్ నుంచి తోట వెంకటేశ్ ఇంటికి రావడంతో ఈ విషయం తెలుసుకున్న పుత్తా నరసింహారెడ్డి పెద్దచెప్పలి గ్రామంలోని తోట వెంకటేశ్ స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. వెంకటేశ్ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని పార్టీ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సీఎం సహాయ నిధికి రూ.50వేలు విరాళం

వేంపల్లె, సెప్టెంబరు 8: సీఎం సహాయ నిధికి రూ.50వేలు చెక్కును అందించారు. ఆదివారం పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి వేంపల్లెకు చెందిన టీచర్ నరసింహారెడ్డి, సుకన్య దంపతులు అందజేశారు. సీఎం సహాయ నిధికి విరాళం అందించిన నరసింహారెడ్డి, సుకన్య దంపతులను ఈ సందర్భంగా బీటెక్ రవి అంఅభినందించారు.

ఈ కారయక్రమంలో నరసింహారెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి,కోడలు రమ్యరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ రామమునిరెడ్డి, రఘునాతరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, పసుపులేటి వీరభద్ర, మడక శ్రీనివాసులు, గోగుల మల్లి తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ను తినిపిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 8 : కడప నగరం పాతకడప వెంకటసుబ్బయ్య రైస్‌మిల్లులో టీడీపీ నాయకులు క్రిష్ణారెడ్డి, ఎద్దుల శంకర్, చైతన్య ఆధ్వర్యంలో 25 కేజీల భారీ కేక్ కట్ చేసి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటరు సురేశ్, నాయకులు శేఖర్‌రెడ్డి, శ్రీధర్, క్రిష్ణ, రాజీ, సుధాకర్, మనోజ్‌కుమార్, శ్రీనాథ్, సుమిత్ర, నిమ్మకాయల నారా యణరెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్‌లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ...



పండ్లు, బ్రెడ్లు అందిస్తున్న డాక్టర్ నజీముద్దీన్

కడప నగరం కొత్తరిమ్స్‌లో దంత వైద్యుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నజీముద్దీన్ ఆధ్వర్యంలో శ్రీనివాసులరెడ్డి జన్మదిన సందర్భంగా బాలింతలకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటరు జహీరుద్దీన్, జేకే యూత్ ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు జియావుద్దీన్, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న గోపీకృష్ణ, తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 8 : కడప నగరం శంకరాపురంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణనాథుని పూజలు ఘనంగా నిర్వహించారు. కంచి గోపీక్రిష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జనసేన నాయకులు తుంగా రమణయ్య, ఉంగరాల విజయ్, తుంగా కిరణ్, తుంగా మధు, శ్రీను, సిద్దు, రాజా, కోలా మల్లి, తోట సుమన్, గాజుల ప్రసాద్, టీడీపీ నాయకులు రవితేజ, చినబాబు, రవి, శివ, సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 8:ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆర్‌జేయూపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షతన పదవీ విరమణ పొందిన ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడానికి కట్టుబడి ఉందని అన్ని సంఘాల సహకారంతో స మావేశం నిర్వహించి వారి అభిప్రాయాల మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ పెండింగులో ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధపలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, టీచర్‌హోం అధ్యక్షుడు బండారు రజాగోపాల్, ఆర్‌జేయూపీ కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాదరావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం కోసం జర్నలిస్టుల కృషి

● ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి



వేంపల్లె ఏపీడబ్ల్యూజే నూతనకార్యవర్గ ఎంపిక సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 8: సమాజానికి మంచి జరగాలనే ఉద్దేశంతోనే జర్నలిస్టులు ఎల్లప్పుడు పనిచేస్తుంటారని ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని తనవృత్తి ధర్మాన్ని నిర్వర్తించే క్రమంలో అందరిని సంతృప్తిపరిచే పరిస్థితి ఉండదని తెలియజేశారు. వేంపల్లెలోని ఆర్అండ్‌బీ అతిథి భవనంలో ఏపీడబ్ల్యూజే వేంపల్లె మండల నూతన కార్యవర్గ ఎంపిక సమావేశం ఆదివారం జరిగింది. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచు ఆర్ శ్రీను, టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, యువనాయకులు రజనీకాంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, ఎస్ఐ తిరుపాల్‌నాయక్ పాల్గొని మాట్లాడారు.

నూతన కార్యవర్గం ఎంపిక: వేంపల్లె మండల ఏపీడబ్ల్యూజే నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి ప్రకటించారు. అధ్యక్షుడిగా రఘునాథరెడ్డి, కార్యదర్శిగా బాలం జయచంద్ర, కోశాధికారిగా షేక్ ఖదీర్, ఉపాధ్యక్షుడిగా బాలం హరిమనోహర్, కృష్ణమోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, రామకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుబ్బారెడ్డి, అమర్‌నాథరెడ్డి, రమేష్, శ్రీనివాసులరెడ్డి, అంజాద్‌బాష, సహాయ కార్యదర్శులుగా రవికుమార్, వెంకటరమణ, రహీం, కమిటీ సభ్యులుగా హరి, నాగేశ్వర్‌రావు తదితరులను ఎన్నుకున్నారు.

10న ఆందోళన: సీఐటీయూ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 8 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణకు నిరసనగా 10న కలెక్టరేట్ వద్ద జరుగు ఆందోళనలో పాల్గొనాలని సీఐటీయూ నేతలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, శ్రీనివాసులరెడ్డి, జిల్లా కోశాధికారిలక్ష్మీదేవి పిలుపునిచ్చారు.

'అన్ని యాజమాన్య పాఠశాలలను ఒకే గూటి కిందికి తేవాలి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 8 : అన్ని యాజమాన్య పాఠశాలలకు ఒకే గూడు కిందకు తీసుకురావాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని యాజమాన్య పాఠశాలలను ఒకే గూటి కిందకు తెచ్చి పేద, ధనిక వర్గాలకు సమాన విద్యనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు ఉమాకంత్, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మజ, రాంగోపాల్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న సాయి కటుంబ సభ్యులు

చెన్నూరు, సెప్టెంబరు 8 :పుష్పగిరి రోడ్డులోని పునీత్ లారెన్స్ వృద్ధాశ్రమంలో జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ కడప కార్యాలయ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ గంధం సాయిశ్రీనివాస్ తన కుమారుడు గంధం నాగసాయిసృజన్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం పుణ్యకార్యంగా భావిస్తున్నానన్నారు. పోషణకరువైన నిరుపేదలకు సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ సతీమణి, తల్లి నారాయణమ్మ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం విస్తరించాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 8 : సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని మరింత ముందుకు తీసకెళ్లాలని జేవీవీ జిల్లాగౌరవాధ్యక్షులు వైవీయూ ప్రొఫెసరు డాక్టర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీలో జేవీవీ జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. జేవీవీ నాయకులు దేవదత్తం, శివరాం వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, సుబ్బయ్య, మురళి, డేవిడ్, రూత్ ఆరోగ్యమేరీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అంధుల సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక



నూతనంగా ఎంపికైన జిల్లా కార్యవర్గం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 8 : జాతీయ అంధుల సమాఖ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా పార్థసారథి, రామిరెడ్డి నగ్రేంద్రకుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.ఆదివారం కడప నగరం ఎన్జీవో కాలనీ అంధుల సమాఖ్య కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కోశాధికారిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా సంజామల దస్తగిరి, మీనరాశి నాగరాజు మహిళా ఉపాధ్యక్షులుగా రామలక్ష్మమ్మ,కార్యదర్శులుగా ఉమామహేశ్వర్‌రెడ్డి, రాముల సుబ్బరాయుడు, ఏర్ల శివ, కార్యవర్గసభ్యులు మరికొంత మందిని ఎంపిక చేశారు. 2027 వరకు ఈ నూతన కార్యవర్గం కొనసాగుతుందని దానికి సంబంధించిన తీర్మానాలను చేశారు.

ఎమ్మెల్యే చొరవతో బాగుపడ్డ రోడ్డు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 8: స్థానిక మూడురోడ్ల కూడలిలో వెల్కమ్ ఆర్చి వద్ద రోడ్డు సరిగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడేవారు. వర్షాకాలంలో నీరు నిలిచి గుంతలు కనిపించక చాలామంది ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి ఈ విషయం గ్రహించి టీడీపీ నాయకుడు ఖాదర్‌బాషాకు ఆర్చి వద్ద ఉన్న గుంతలు పూడ్చాలని సూచించడంతో వెంటనే ఆదివారం ఆ పనులు పూర్తి చేశారు. దీంతో వాహనదారులు హర్షం తెలిపారు.

మాట నిలుపుకున్న పుట్టా

● వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్



ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దుంపలగట్టు వాసులు

ఖాజీపేట, సెప్టెంబరు 8: ఎన్నికలకు ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి దుంపలగట్టులో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహానికి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరయ్యారు. గత ఎన్నికల్లో మండల పరిధిలోని దుంపలగట్టులో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరారు. తాము వినాయక చవితి రోజు పండుగ చేసుకోకుండా అరాచకాలు చేస్తున్నారని, మీరు ఎమ్మెల్యేగా గెలిచి మా ఊరికి వచ్చి మాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా వినాయక చవితి పండుగను జరుపుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆరోజు గ్రామస్థులు కోరారు. ఆమేరకు శనివారం రాత్రి దుంపలగట్టులోని రాముని దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, గోవిందు, సుబ్బయ్య, శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, బాలకొండారెడ్డి, వాకమల్ల వెంకటరామిరెడ్డి, బుచ్చిరెడ్డి, జానకీరాం, రాము, మామిళ్ల క్రిష్ణారెడ్డి, పిచ్చినాయుడు, జెండాల మాబాష తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 8: అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్-18, 20, 23 విభాగంలో స్త్రీ, పురుషులకు 100, 200, 400, వెయ్యిమీటర్ల రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన మొదటి, రెండోస్థానంలో నిలిచిన క్రీడాకారులను ఈనెల 14, 15, 16 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాష తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ సంచాలకులు నాగూర్‌బాష, రాఘవేంద్ర, అనిల్, దిలీప్, నాగేశ్వరరావు, మురళి, కుమార్, ఖాదర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు విశిష్టతపై వీడియో ఆవిష్కరణ



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 8: ప్రొద్దుటూరు పట్టణ విశిష్టతపై యువకులు తీసిన వీడియోను టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ నడిగడ్డన వుండే ప్రొద్దుటూరుకు ఆపేరు రావడం వెనుక వున్న పురాణ గాథలను ఈ వీడియోలో చిత్రీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

బద్వేలుటౌన్, సెప్టెంబరు 8: స్థానిక బైపాస్‌రోడ్డులో శనివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి బి.వెంకటే శ్వర్లు(39) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గొల్లపల్లె వాసి వెంకటేశ్వర్లు తన స్నేహితుడితో వినాయ కుడి బొమ్మను తీసుకువెళ్లేందుకు బద్వేలుకు వచ్చారు. బొమ్మను తీసుకువెళుతుండగా ప్రమాదవశాత్తు వెంకటే శ్వర్లు ట్రాక్టర్‌కింద పడ్డాడు. స్నేహితులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

వరద బాధితులకు సహాయం



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్ ముక్తియార్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 8: విజయవాడ వరదబాధితుల సహాయం కోసం అంజుమన్ అహలే ఇస్లాం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు మసీదులలో భారీగా విరాళాలు సేకరించినట్లు మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ పేర్కొన్నారు. ఆదివారం మైదుకూరు రోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ హాల్లో మసీదుల నుంచి సేకరించిన బియ్యం,కందిబేడలు తో పాటు ఇతర సామగ్రిని అంజుమన్ కమిటీ సభ్యులు పరిశీలించారు. సోమవారం ఉదయం వీటిని విజయవాడలోని వరదబాధితులకు అందజేయడం కోసం ఇక్కడి నుంచి లారీలో వీటిని తరలిస్తామనితెలిపారు. పట్టణంలోని ముస్లింలు, స్వర్ణకారులు మార్కెట్ వ్యాపారులు అందరూ కలిసి దాదాపు 10 లక్షలకు పైగా నగదు విరాళాలు ఇచ్చారన్నారు.ఆపదలో వున్న మనుషులకు ఆదుకోవడం మానవధర్మం అన్నారు. ప్రాంతాలు ఏవైనా మనుషులకు కష్టం వస్తే వారిని కుల,మత ప్రాంతాలకు అతీతంగా సహాయం చేయడం అభినందనీయమన్నారు. అంజుమన్ అహలే ఇస్లాం అధ్యక్షుడు బొల్లారం బాషా మాట్లాడుతూ విజయవాడలో వచ్చిన వరదలతో జనజీవనం అతలాకుతలం అయిందన్నారు. ప్రభుత్వం చేసే సహాయ కార్యక్రమాలతో పాటు మానవ సమాజం స్పందించాలన్నారు. అందులో భాగంగా అంజుమన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించామన్నారు.వీటిని కలెక్టరుకు అందజేస్తామన్నారు. ఇంకా రేపటికి వచ్చే విరాళాలు, సరుకులు అన్నింటినీ సోమవారం తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంజుమన్‌మాజీ అధ్యక్షుడు ఇక్బాల్, సీనియర్ న్యాయవాది దాదాపీర్ ,మాజీ ఖాజీ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: గుంటూరు జిల్లా ఆవులపాలెం గ్రామం ఇటీవల ముంపునకు గురికావడంతో విషయం తెలుసుకున్న బ్రహ్మంగారిమఠం శ్రీకృష్ణ దేవరాయల బలిజ, కాపు, తెలగ అన్నదాన సంఘం కమిటీ సభ్యులు 113 కుటుంబాలకు పది కేజీల కందిపప్పు, ఉల్లిగడ్డలు, కూరగాయలు, చింతపండు, బిస్కట్లు, తాగునీరు బాటిల్స్, పంచెలు, చీరలు, టవల్స్, స్వెటర్స్, రెయిన్ కోట్లు ఒక్కో కుటుంబానికి ఆదివారం పంపిణీ చేసినట్లు బలిజ సంఘం అధ్యక్షుడు గోశెట్టి పిల్లనారాయణగారిశ్రీరాములు, కార్యదర్శి బొల్లు సిద్దయ్య, కోశాధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జీటీ ఓబులేసు, రచయిత బొల్లు రామ్మోహన్, సభ్యులు బి.సుబ్బరాయుడు, నరేశ్, హరిక్రిష్ణయ్య, బాలక్రిష్ణ పాల్గొని సభ్యులకు వస్తువులు పంపిణీ చేశారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు శివకుమార్, శివనారాయణ, సురేంద్ర తదితరులు ఇంటింటికి వెళ్లి వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు యల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ కమిటీ నాయకులు క్రిష్ణారెడ్డి, సురేంద్ర, మోహన్, పల్లా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు వస్తువులు పంపిణీ చేస్తున్న బిమఠం బలిజ సంఘం కమిటీ సభ్యులు

'పొలానికి రీసర్వే నిర్వహించాలి'

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 8: రూరల్ పరిధిలోని బొజ్జవారిపల్లెలో ఉన్న తమ పొలానికి రీ సర్వే నిర్వహించాలని ఆ గ్రామానికి చెందిన బుర్రి బాలయ్య పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబరు 291/1బి, 291/2బిలలో 73 సెంట్ల పొలం ఉందన్నారు. జగనన్న సర్వేలో తనకు 4 సెంట్లు స్థలం వస్తుందని సర్వేయర్ చెప్పారని తెలిపారు. అయితే కొత్తపొలం యజమానుల ఒత్తిడితో సర్వేయర్, వీఆర్వోలు హడావిడిగా సర్వే నిర్వహించి తమ భూమిని 10 సెంట్లు ఆక్రమించి సరిహద్దు రాళ్లు పాతడం దారుణమన్నారు. వీఆర్వో, సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమ పొలానికి రీ సర్వే చేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బుర్రి బాలయ్య సతీమణి వెంకటసుబ్బమ్మ, కుమారుడు నాగేంద్ర పాల్గొన్నారు.

థర్మల్ కేంద్రాల నుంచి అధిక లోడ్లతో బూడిద తరలింపు

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కుంచం వెంకటసుబ్బారెడ్డి ఫిర్యాదు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 8: డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రాలతో పాటు రాష్ట్రంలోని అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలనుంచి అధికలోడ్లతో బూడిదను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారని దీనిపై విజిలెన్సు అధికారులతో విచారణ జరపాలని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన థర్మల్ విద్యుత్ కేంద్రాలలో జరుగుతున్న బూడిద దోపిడీపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు ఆయన మాట్లాడుతూ థర్మల్ కేంద్రాల నుంచి నిబంధనలు ఉల్లఘించి అధికలోడ్లుతో వెళుతున్నా రవాణా అధికారులు మామూళ్లు తీసుకుని ఈ రవాణా సాగిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఈ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



పదవీ విరమణ చేసిన సుబ్బిరెడ్డిని సన్మానిస్తున్న సీఎం.సురేశ్‌నాయుడు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 8: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం.సురేశ్ నాయుడు పేర్కొన్నారు. ఎర్రగుంట్ల ఎంపీపీ స్కూల్ మెయిన్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తూ రిటైర్డ్ అయిన కే.సుబ్బిరెడ్డికి పదవీ విరమణ ఆత్మీయ సన్మాన సభను ఆదివారం సాయి కళ్యాణ మంటపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి ,హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

గోపవరం, సెప్టెంబరు 8: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగ పరుచుకోవాలని మండల ప్రత్యేక అధికారి మర్రిపాటి నాగరాజు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయాశాఖల అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. అలాగే ఉదయం 9 నుంచి 10 వరకు డయల్ యువర్ కలెక్టరు కార్యక్రమం ఉంటుందని ప్రజలు కలెక్టరుకు ఫోను చేసి తమ సమస్యలు తెలపాలన్నారు. 08562 - 244437 నెంబరుకు కాల్ చేసి వారి సమస్యలు తెలుపవచ్చని అన్నారు.

రేపు ఆందోళన

బద్వేలు,సెప్టెంబరు 8: ఏపీకి తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈ నెల 10 వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ నాయకులు ఎస్‌కే మస్తాన్ షరీఫ్, ఆదిల్, నాగలక్ష్మి, ఫాతిమా, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


జగనన్న లేఅవుట్‌లో స్థలాల వివాదం

జమ్మలమడుగు, సెప్టెంబరు 8: గండికోటకు వెళ్లే దారి ఒంటిమిద్దె గ్రామ సమీపాన ప్రధాన రోడ్డు పక్కన పూర్వపు బొమ్మేపల్లె జగనన్న లేఅవుట్ స్థలాల్లో ఆదివారం వివాదం చోటు చేసుకుంది. సీఐ లింగప్ప వివరాల మేరకు బొమ్మేపల్లె వాసులు ముర్రా రాజశేఖర్‌రెడ్డి, హరినాథరెడ్డి సహా మరో నలుగురు జగనన్న లేఅవుట్‌లో ఎక్స్‌కవేటర్ సాయంతో బేస్‌మెంట్ రాళ్లను పునాది కోసం తీసిన మట్టి, రాళ్లను పెకిలించినట్లు పలువురు గ్రామస్థులు స్టేషన్ వద్దకు వచ్చి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వెంటనే తమ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు సీఐ తెలిపారు. అక్కడ పెద్దబాలిగారి లక్ష్మీదేవి, దేవి బేస్‌మెంట్, పునాది రాళ్లను పక్కకు తీసేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. సర్వే నంబరు 381, 382 సర్వే నంబర్లలో 180 ప్లాట్లు అప్పట్లో అధికారులు లేఅవుట్లు వేసినట్లు 40 నుంచి 44 మందికి పట్టాలు ఇచ్చినట్లు స్టేషన్ వద్ద బాధితులు పోలీసులకు తెలిపారు. అయితే సీఐ లింగప్ప, ఎస్‌ఐ రామకృష్ణ గ్రామస్థులతో మాట్లాడి ప్రస్తుతం ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి జరిగిన ఘటనకు సంబంధించి చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కల్పన, పోలీసు సిబ్బంది, బొమ్మేపల్లె బాధిత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు



ప్రొద్దుటూరు...నేతాజీనగర్‌లో వినాయకుడు




జమ్మలమడుగు దేవగుడిలో వినాయక విగ్రహం వద్ద టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బీజేపీ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, కొండాపురం సీఎంఆర్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన 18 అడుగుల భారీ గణపతి విగ్రహం, ముద్దనూరు, రాజుపాలెం, ఎర్రగుంట్లలో కొలువుదీరిన వినాయకులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 8: వినాయక చవితి పర్వదినం సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గణనాథులు కొలువుదీరారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో స్వామివారికి పూజలు నిర్వహించారు. శివాలయంలో చతుర్ముఖ శ్వేత గణపతి, వెదుర్ల బజార్‌లో బాలగణపతి, నేతాజీనగర్‌లో శివగణపతి, మనోజీ రావులో సూర్యగణపతి, బాలాజీ అపార్టుమెంట్ వద్ద గజ గణపతి, వైఎంఆర్ కాలనీ సరస్వతి విద్యామందిరంలో సీతారామ గణపతి, ఒక్కోచోట ఒక్కో రూపంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. కొన్ని ఉత్సవ కమిటీల నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జమ్మలమడుగు..: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గణేశ్ కమిటీ వారు వాడవాడలా వినాయక విగ్రహాలను కొలువుచేశారు. మండలంలోని దేవగుడి గ్రామంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గ్రామస్థులు విగ్రహాల వద్ద పూజలు చేసి మొక్కుకున్నారు. మండలంలోని గూడెం చెరువు, గండికోట, అంబవరం, రాజీవ్‌నగర్ కాలనీ, మోరగుడి, తదితర అన్ని గ్రామాల్లో వినాయక చవితి పండుగ భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించి పూజలు చేసి మొక్కుకున్నారు. అలాగే పట్టణంలోని కన్నెలూరు గ్రామంలో కోతి సమాధి సమీపాన వినాయక విగ్రహాన్ని కొలువుదీర్చారు. కన్నెలూరు గ్రామంలో శివగణపతి ఉత్సవ సేవా కమిటీవారు వినాయక విగ్రహం వద్ద వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆర్టీసీ బస్టాండు ఎదురుగా, మెయిన్‌బజార్, మెయిన్‌పోస్టాఫీసు సమీపాన, ఎంపీడీవో కార్యాలయం కార్యాలయం వెళ్లే సర్కిల్ నందు, తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు కొలువయ్యాయి.

కొండాపురం..: మండలంలో వాడవాడల వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం మండపాల్లో గణనాథులు కొలువుదీరారు. కొండాపురం పట్టణంలో సీఎంఆర్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన 18 అడుగుల భారీ గణపతి విగ్రహం అందరినీ అకట్టుకొంటోంది. అదేవిధంగా మండలంలో పలుచోట్ల విభిన్న రూపాల్లో గల వినాయకుని విగ్రహాలను ఏర్పాటుచేశారు.కాగా మండలంలో సోమవారం నిమజ్జనాన్ని నిర్వహిస్తున్నారు.

ముద్దనూరు..: వినాయకచవితి సందర్భంగా బొజ్జ గణపయ్యలు కొలువుదీరారు.మండల వ్యాప్తంగా 95 విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోగా దాదాపు 80 విగ్రహాలకు అనుమతి తీసుకున్నారు.శనివారం వినాయకులను నిలిపి భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఇళ్లలో వినాయకుల విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, పండుగను జరుపుకున్నారు.

మైలవరం..: గణనాథునికి గ్రామాల్లో శని, ఆదివారాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతో ఆటపాటలతో చిన్నారుల సందడి నెలకొంది. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మూడో రోజు సోమవారం ఆయా గ్రామాల సమీపాల్లో జీఎన్ఎస్ఎస్, కుంటల్లో, కాలువల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రాజుపాలెం..: వినాయక చవితి పండుగ సందర్భంగా యువత వాడవాడలా గణపయ్యలను కొలువుదీర్చారు. మండలంలో 15 పంచాయ తీల్లో దాదాపు 82 విగ్రహాలు ఉన్నట్లు ఎస్ఐ కత్తివెంకటరమణ తెలిపారు. మూడు, ఐదురోజుల్లో వినాయక నిమజ్జనం జరుగుతుందన్నారు. కాగా వినాయకచవితి పండుగ పురస్కరించుకుని శనివారం ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం కుందూనదిని పరిశీలించారు.

బద్వేలు..: బద్వేలు పట్టణ వినాయక చవితి ఉత్సవాలు శనివారం నుంచే ఘనంగా ప్రారంభమయ్యాయి. బద్వేలు, గోపవరం మండలాల పరిధిలో దాదాపు 190కి పైగా విగ్రహాలను ఆయా ఆలయ కమిటి వారు ఏర్పాటు చేశారు. అంతేగాక పలుచోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకోగా, అన్నదాన కార్యక్రమాలు చేశారు.

8బిడిఎల్2ః నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన గణనాథుడు

పోరుమామిళ్ల..: పోరుమామిళ్ల మండల ప్రజలు గణనాథునికి పూజలు నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీలు, గ్రామాల్లోగణనాథు ని విగ్రహాలు ఏర్పాటు చేశారు. అలాగే పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. పోరుమామిళ్లలోని మూలవీధి, తంబాబావివీధి ప్రాంతాల్లో సర్పంచ్ పాల్గొని పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కొత్తవీధి, రామాయణవీధి, అమ్మవారిశాలవీధి, వెంకటేశ్వరుడి దేవాలయంతో పాటు ప్రతి వీధిలో పోటాపోటీగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. వేంకటేశ్వర స్వామి దేవాలయంలో తోటోత్సవం నిర్వహించారు. రెడ్డినగర్‌లో రామాలయం సమీపంలో రెడ్డినగర్ పెట్రోలు బంకు వెనుక వైపున రాఘవేంద్రనగర్, కమ్మవారిపల్లె, వినాయకనగర్ ప్రాంతాల్లో గణనాథుల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

మైదుకూరురూరల్..: మైదుకూరు మున్సిపాలిటీ,మండలంలో వినాయక చవితి పండుగ సందర్బగా చాలా వరకు వీధి,వీధిలో గణేష్ ప్రతిమలు, వివిధ రూపాలలో నిలిపారు. ఆకుల వీధిలో గణనాధుడు ప్రతిమ పలువురి ప్రశంసలు అందుకొంది.పట్టణంలో కొంత మంది శుక్రవారమే వినాయక ప్రతిమలు నిలపడంతో ఆదివారం కుందునదిలో నిమజ్జన కార్యక్రమం గావించారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్ల మండలంలోని నగరపంచాయతీ, గ్రామాల్లో బొజ్జగణపయ్య కొలువుతీరారు. శనివారం వినాయకచవితి సందర్భంగా వందలాదిగా వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసి వైభవంగా పూజలు నిర్వహించారు. 5రోజుల పాటు చాలా చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, చెక్కభజనలు, నృత్యాలు, జబర్దస్త్ షోలు నిర్వహించనున్నారు. ఎర్రగుంట్ల నడివూరులోని శ్రీరామాలయ ప్రాంగణంలో విల్లును ధరించిన వినాయకుడు కొలువుతీరాడు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఏరువాక గంగమ్మ ఆలయం వద్ద 6అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మహేశ్వరనగర్, మహాత్మానగర్, మరికొన్ని చోట్ల కూడా భారీ విగ్రహాలు ఏర్పాటు చేసి నిత్యపూజలు నిర్వహిస్తున్నారు.

చాపాడు..: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు వినాయక చవితి పండుగను ఈనెల 7న శనివారం నుంచి రెండు రోజులపాటు ఘనంగా జరుపుకున్నారు. రాజుపాళెం గ్రామంలో నీలం ప్రసాద్, వీరేంద్ర రూ.1.50 లక్షలు అన్నదానానికి విరాళంగా ఇచ్చారు. నక్కలదిన్నె, చాపాడు, సిద్దారెడ్డిపల్లె , లక్ష్మీపేట, అల్లాడుపల్లె, కేవతరం అన్నవరం, తదితర గ్రామాల్లో ఐకమత్యంతో పండుగను జరుపుకున్నారు.

బద్వేలుటౌన్..: వినాయక చవితి సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోని మండపాల్లో భక్తిశ్రద్దలతో బొజ్జగణపయ్య పూజలు అందుకున్నారు.కొన్ని ఉత్సవ కమిటీలవారు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొన్ని ఉత్సవ కమిటీల వద్ద కుంకుమార్చనలు నిర్వహించడంతో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




చాపాడు, ప్రొద్దుటూరు శివాలయం వద్ద కొలువుదీరిన మట్టి గణపతి

గోపవరం..: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోవినాయక చవితి పండుగ సందర్భంగా సందడి వాతావరణం నెలకొంది. మండపాల్లో స్వామికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఉన్న మహిళలు తమ మొక్కులు తీర్చుకోవడానికి అడుగడుగునా ప్రసాదాలు పంపిణీ చేశారు.

బ్రహ్మంగారిమఠం..: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో కొత్తూరు, పాతూరు గ్రామాలో మఠం సెంటరులో వీరనారాయణపురం గ్రామంలో గంగిరెడ్డిపల్లె, నరసన్నపల్లె, కొత్తబస్వాపురం, తెలుగుగంగ కాలనీ, సోమిరెడ్డిపల్లె, మదిరెడ్డిపల్లె గ్రామాల్లో శనివారం వినాయకచవితి సందర్భంగా గణనాధులను ఏర్పాటు చేసి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, కమిటీ సభ్యులు, యువకులు కార్యనిర్వాహక కమిటి సభ్యులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు మున్సిపాలిటీ కన్నెలూరు వద్ద వినాయక విగ్రహం ఎదురుగా అన్నదాన కార్యక్రమం




మైలవరంలో పూజలు చేస్తున్న చిన్నారులు, పోరుమామిళ్ల రెడ్డినగర్‌లోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహం



మైదుకూరు..ఊరేగింపులో యువకుల సందడి



గోపవరం

నేడు 55 గణేశ్ విగ్రహాలు నిమజ్జనం

అట్లూరు, సెప్టెంబరు 8 : అట్లూరు మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో 71 గణేశ్ విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు. వినాయకునికి మంటపాలు ఏర్పాటు చేసి భక్తితో గణపతికి ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు వినాయకుని మంటపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నేడు ఎ 55 గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నిమజ్జనానికి సిద్దవటం పెన్నానదికి తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వెయ్యిమందికి టీషర్టులు పంపిణీ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 8 : వినాయకచవితిని పురస్కరించుకుని గణపతి బొమ్మలు ఉండే టీషర్టులను వెయ్యిమందికి ఎస్ఐ కొండారెడ్డి చేతుల మీదుగా బీఆర్ఆర్ షాపు యాజమాన్యం పంపిణీ చేశారు. పోరుమామిళ్లలో వినాయకచవితి నిమజ్జనం సమయంలో అందరికీ ఉపయోగపడే విధంగా యువకులకు టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు ఫణిరావు పాల్గొన్నారు.

రేపు మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 8: మాదకద్రవ్యాల నిర్మూలనపై స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె ర్యాలీకి సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు విజయకుమార్ సర్కిల్ నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, మల్లేష్ పాల్గొన్నారు.